ఉదయం పత్రిక

నవ కవిత

కంది శంకరయ్య

పొద్దు

నవ కవిత

రంధి సోమరాజు

B

వెల :

మూడు రూపాయిలు

మొదటి కూర్పు

వేయి ప్రతులు

జూన్ 1972

ముద్రణ

సరస్వతీ పవర్ ప్రెస్

రాజమండ్రి

ఈ కవితా సంపుటికి అడిగిన వెంటనే తొలిపలుకు రాసి యిచ్చిన

శ్రీ దాశరధిగారికి
శ్రీ మల్లంపల్లి శరభేశ్వరశర్మ గారికి
శ్రీ సంజీవదేవ్‌గారికి

"ఏనంగి పొద్దులు" కవితను

A. I. R. లో ప్రసారం చేసిన విజయవాడ
స్టేషను డైరకరు గారికి
తమ త్రైమాసిక పత్రికలో ప్రచురించిన "వేకువ" సంపాదకునికి

ఈ పుస్తకానికి ముఖపత్ర రచన చేసిన
శ్రీ శీలా వీర్రాజు గారికి

నా కృతజ్ఞతాభి వందనములు.

రంది సోమరాజు

ఇందులో

వోనాకాలం

శీతకట్టు

ఏసంగి పొద్దులు



13.1.70

ప్రియమిత్రులు శ్రీ వేగుంట కనకరామబ్రహ్మం గారికి.

నిండు వెన్నెలా అపార పారావారం చేయీ చేయి కలుపుకొని
వాహ్యాళికి తరలినట్లు ఎప్పుడూ మా స్నేహం !
అందుకే ఆ నిండైన మనిషికి ఈ మూడు కాలాల పూలహారం !

సోమరాజు

౬
సజీవ కవిత

కాలం మారింది. కవితా రచనా రీతి మారింది. ఒకనాడు వ్యావహారి కాన్ని జీవద్భాష అనుకున్నాం. కాని ఈనాడు అక్షరం వ్రాయలేని చదువలేని నిరక్షరాస్యులు ఇంకా అధికసంఖ్యలోవున్నమనదేశంలో వాళ్ళుమాట్లాడుకునేభాషే నిజమైన జీవద్భాషేమో ! రంధిసోమరాజుగారు ఆ భాషలో కవిత రాస్తున్నారు. కొన్ని యెంకిపాటల్లో జానపద భాషవుంది. కాని అవిగేయాలు. రంధి సోమరాజు గారిది సిసలైన వచన కవిత. ఇంగ్లీషులో దీన్ని Free verse అని కొందరు అన వచ్చు. కాని Free verse అనేమాట విషయంలో నాకు అభిప్రాయభేదం వుంది. దీన్ని Open Form అంటే బాగుంటుంది. అది ఎట్టినిబంధనలులేకుం డా స్వేచ్ఛగా నడిచే రచన. వచన కవిత్వకు ఏవో నియమ నిబంధనలు ఉన్నాయని, ఉంటాయని కొందరు వాదిస్తారు. వారితో నేను ఏకీభవించలేను. నియమం వున్న చోటం 'ఫ్రీ' కాలేదు.

నేడు వాస్తుశాస్త్రం ఎంత అభివృద్ధిచెందిందో సాహిత్యంకూడా అంత అభి వృద్ధి చెందింది. ఒక మహాసౌధాన్ని నూదిమొనమీద నిలబెట్టగల technique (టెక్నిక్) వాస్తువులోవచ్చి నట్లే సాహితీ జగత్తులోనూ ముఖ్యంగా కవితలోను అంత్యనియమాలు, అంత్యప్రాసలు, యమకాలు, ఊపులూ పాతబడిపోయి విచిత్రమైన ఒక కొత్తటెక్నిక్ వచ్చింది. చిన్న మాటబొమ్మతో మిన్నగా కవిత ఒదిగిపోగలుగుతున్నది. అది పచ్చివచనంలా కనిపిస్తుంది. కాని దానిలో కవిత ధ్వనిస్తుంది. ఈకవితను Organic Poetry(సజీవ కవిత) అన్నా అనవచ్చును.

నేటి కవితా రచనారీతిలో కొత్తపుంతను తొక్కిన కవిరాజు రంధిసోమ రాజు. ఈకవి ఉపయోగించే కవిసమయాలు, మాటబొమ్మలు ఆత్యాధునికంగా వుంటూ, సుపరిచితంగా అనిపిస్తూ పాఠకులను ఆశ్చర్య చకితులను చేస్తాయి.

ఋతువులను గురించి కాళిదాసుకాలం నుంచీ కావ్యాలు వస్తూనే వున్నాయి. ఒక్కొకరు ఒక్కొక రకంగా అనుభూతి పొందుతున్నారు. తమ అనుభూతిని కవితలో పొదుగు తున్నారు. ఈసంపుటిపేరు "పొద్దు". పొద్దు అనేది కాలానికి పర్యాయపదంగా కవి వాడారు. ఇందులో వర్ష, హేమంత, గ్రీష్మాలను కవి తీసుకున్నారు. నిజానికి శిశిరం హేమంతం కలగలిసి వుంటాయి. అలాగే వసంత గ్రీష్మాలూ కలగలిసి పోతాయి. శరత్తు హేమంతం లోకి

చొచ్చుకు పోతుంది. వర్షం విడిగా నిలుస్తుంది. కనుక ఈకవి మూడు ఋతువులనే తీసుకున్నారు.

ఈ సంపుటిలో తొలిఋతువు" వోనాకాలం "

"సూరీడ్ని సొక్కా జేబులో ఏసి
మూ సేత్తున్నట్టు
సెనంలో మబ్బులు
నోకాన్ని మూసేత్తాయి "

వర్షఋతువును గురించి ఇంతవరకూ చెప్పిన కవులు అడుగు పెట్టని దారిలో కవి వెళుతున్నాడనడానికి పైపంక్తులు చాలు. వాటిలోని భాష, భావం, ఛందం, మూడూ కొత్తగానే కనిపిస్తాయి. ఇందులో కొత్తేమిటి ? మన ఊళ్లలో మాట్లాడుకునే భాషేకదా ! అనవద్దు. ఆ భాషను కావ్యంలోకి ఎక్కించి కావ్యతను కల్పించి, ఒప్పించడం, మెప్పించడం సోమరాజుగారికే చెల్లింది.

" వోనకి మట్టీ యిసకా కొట్టుకుపోయి
కంకర్రోడునిండా లెగిసిన రాలు
దొంగ రాలుగాయి కొన్ని లేర్లా
రంపం పల్ల నా వుంటాయి "

భేషుగాలేదూ ! ప్రయోజనాత్మకమైన సెట్టైర్ !

ఇలా యెన్ని విసురులో ! యెన్ని చెమక్కులో యెన్ని పసందులో ఈ కావ్యం నిండా !

"శీతకట్టు" లో —

" తెల్లార గట్ట
గోదాట్లో
అరటి దొప్పల్లో ఆడోళ్ళాదిలిన దివ్వెలా
సుక్కలికి తల్లి సుక్క లెట్టిన బువ్వలారే ! "

ఆలోచనామృతం సుమా !

" బుజం మీద
నిండాలేని కుండలో
వూగీసలాడే నీలనా
వానికి సత్తోంది గుండె ! "

చాలా వింత ఊహింపు !

"ఏసంగి పొద్దులు" — మరీ బాగున్నాయి చదవడానికి, మననం చేసుకోడానికి.

యెండలో ఆడుకునే పిల్లలకు "ఎండదేవుళ్లు", "సూరిదేవుడి సిట్టిబుల్లోళ్లు" "ఎల్తురు బొమ్మలు" అని నామకరణం చేశారు కవిగారు. ఎంత ముద్దుపేర్లు !

" దుడ్డు లేనోడి యింటి ముందు
అయిరాన సేసే
రాకాసి వమ్మల కలకటేరునా
యెగదోసుకొత్తాది యెండ ! "

యెండ క్రౌర్యం ఇలావుంది !

" సెప్పుల్లేకుండా రోడ్డేసేవోల్ని సూసి
తారుతో కరిగి
డబ్బాల్లోంచి సుక్కలు సుక్కలుగా రాలి
ఏడ్సిండి ఎండి ! "

మరి యెండ కారుణ్యం ఇలావుంది !"

అందరికీ తెలిసిన చిన్నమాటల్లో యేమైనా చెప్పవచ్చని రుజువు చేశారీ కవి. ఫైరింజనును "నీలకారు" అన్నారు.

మన భాషలోనేకాదు, సంస్కృతంలోనే కాదు, ఇతర భాషల్లోనూ ఋతువులపై వ్రాసిన కావ్యాలూ, వాటి అనువాదాలూ చాలా చదివాను. వల్లీ ఋతువులపైనే రాసి సోమరాజుగారు సొంత గొంతు వినిపించారు. సొంత శక్తి చూపించారు. చెప్పేతీరులో, వాడేభాషలో, చేసే వర్ణనలో, కట్టే మాటబొమ్మలో సరికొత్తదనం నిరూపించారు.

సోమరాజుగారి ఇతర రచనలు "బూర్జువా పెళ్లికూతురు" "ఎదగండి" మొదలైనవి చదివాను. ఈయన దొక విశిష్టమైన కవితా రీతి అని అవి చదివిన వారూ, ముఖ్యంగా ఈ "పొద్దు" చదివినవారూ అనకమానరు.

" పిట పిటలాడే .... సిన్నది
రేవుకాడ రైకిసిరేసి
నీల్లో మునిగి
మునేల మీద గట్టిక్కితే
ఓరినాయనో ! ఎయ్యికల్లు సాలవ్ "

అన్నారు రంధిసోమరాజుగారు "ఏసంగి పొద్దులు" అఖరిపుటలో. అలాటి ఆచ్ఛాదనలులేని అపురూపమైన సౌందర్యం నాకు వీరి ప్రతి పంక్తిలో కనిపించింది. సోమరాజుగారి కవితా సౌందర్యాన్ని చూడడానికి వెయ్యికళ్ళుచాలవు !

మద్రాసు
11-5-72

దాశరథి

క్రొత్త ప్రొద్దు

ఎందుకో - ఒకప్పుడు తీక్ష్ణంగా ఒకప్పుడు ఆర్ద్రంగా మరిఒకప్పుడు చల్లగా తన యిచ్ఛానుసారంగా యీప్రకృతినీ, జీవలోకాన్నీ, అనేకావస్థలలో అనేక రూపాలలో మారుస్తూ నిరాకారమై విశ్వగర్భంలోదాగి క్రీడిస్తున్నది కాలం. దాని ఈ నిరంతర ఖేల వాల్మీకి మొదలు మహాకవు లందరి భావనను పరవశింప చేస్తూనే ఉన్నది. ఆలోచించినకొలదీ - అసలు కాలంకంటె అచ్చమై నదీ, ప్రపథమ మైనదీ నిత్యనూతనమైనదీ కవితావస్తువు మరొకటి ఉన్నదా! అనిపిస్తుంది.

వ్యక్తిగతమైన అల్పాల్ప సుఖదుఃఖ పరిధులను దాటి కేవలమూ కాల స్వరూపంమీద మనస్సు నిలుపగలిగితే అంతకంటె కైవల్యం ఏముంది!

ఆదికావ్యంలో శ్రీరామచంద్రుని సీతావిప్రలంభ ఘట్టంలో ఋతువుల ఆనంద తాండవం సముద్రం కెరటాల మాదిరిగా మనకు గోచరిస్తుంది. మానవ సుఖదుఃఖాలను ఋతువులు ఉద్దీపింప జేస్తున్నట్లు కవుల ఆకోపమో! నిజంగా మన సుఖదుఃఖాలకూ - కాలంయొక్క ఆ ఆనంద ఖేలకీ ఏమైనా సంబంధం ఉందోమరి! అయితే - రామచంద్రుని విప్రలంభం ఏ పరాకాష్ఠలో ఉన్నదో అచ్చటి వర్షవర్ణనా అదేపరాకాష్ఠలో వర్ణితమైన తీరు చూస్తే వ్యష్టిచేతనా, సమష్టిచేతనా, ఏదో ఒక నిగూఢమైన శ్రుతిలో నిబద్ధమై ఉన్నట్లు గోచరిస్తుంది. మాన వేతిహాసం లోని సుఖదుఃఖాలమధ్య యిలా ఋతువులను మేళవించి చేతనా చేతసముల మధ్య సమ్రశుతిరమణీయమైన ఒకానొక సౌందర్యమయసేతువును ఆదికవి నిర్మిస్తే అదిఒక కావ్యమార్గమై అనంతరకవులకు రాచబాట అయింది.

కాళిదాసు తన కవిత్వపు తొలిపరువ మంతా ఋతువులకే మీదుకట్టాడు. ఆయితే ఆ ఋతువులు ఉజ్జయినీ ప్రాసాదవాతాయనాలలోనుంచి శిప్రానది మీదుగా ఉద్యానవనాల్లోనికి, చూస్తేనేగాని కనిపించని రాణివాసపు స్త్రీలు! ఆ భోగభూమి కృతపుణ్యులకే కాని సామాన్యుల కందుబాటులో ఉండదు.

మరి - ప్రాసాదవాతాయనాలలో నుంచే శ్రీకృష్ణ దేవరాయల వారు సామాన్యుల కడగండ్లన్నీ చూశారు. చివరికి-పిడుగులకి భయపడి స్త్రీలు కంచాలు

ఇళ్ళల్లోనే తొలిచి, నీళ్ళు గడపల మీదుగా పెరళ్లల్లోకి చిమ్మటం కూడా ఆయన చూపును తప్పించుక పోలేదు.

అనలు కనిపించేది దేశం. కనిపించనిది కాలం! కనిపించే దేశంమీద కనిపించని కాలం ఎలా పరచుకొని ఉంటుందో అలాంటికాలాన్ని చూచే కన్ను కొందరికే ఉంటుందికాబోలు! ఏదేశంలోనైనా ఇవేకదా ఋతువులు! అయినా ఋతువులలోని తెనుఁగుతనం విస్పష్టంగా సాక్షాత్కరింపఁజేయ బడింది తెనుఁగు ఋతువుల్లో! "తెనుగుఋతువులు" చదివినప్పుడల్లా జన్మలున్నంత వరకూ, పుడితే తెనుగుదేశం పల్లెటూళ్ళల్లోనే మళ్ళీమళ్ళీ పుట్టాలనిపిస్తుంది!

ఇదమిత్థమని చెప్పడానికి లేని ఒకానొక స్పృహణీయతాలక్షణం ఏదో వుంది కాలంలో - కాలాన్ని ధ్యానిస్తూ కవి మహాకవి అవుతాడు. వామనుఁడు త్రివిక్రముఁడుగా మారుతాడు. కాలాన్నీ, కాలంచేత అభివ్యాప్తమైనదేశాన్నీ, ఏక పదం చేతనే ఆక్రమిస్తాడు. ఏక దేశంలోని ఏక క్షణంలోని అనుభవంచేత సర్వ దేశాన్నీ సర్వకాలాన్నీ ఆవరిస్తాడు.

సోమరాజుగారు నిరంతర భావుకుఁడూ సాధకుఁడు. ఆయన భావన, కాలం మీద నిలిచింది. ఆయనవి విశిష్టమైనకన్నూ, చెవీను. ఆకన్ను రూపంలేనిదానికి రూపాన్ని తొడిగితే - ఆ చెవి శబ్దంలోకి రాని ఆ రూపాన్ని శబ్దంగా మార్చి వింటుంది. ఈ పరికరంతో ఆయన రూపం లేని పొద్దుకి రూపంకట్టి - ఆ రూపాన్ని శబ్దంగా మార్చారు!

'పొద్దులో' భాష తూర్పుదేశపు జానపదుల భాష. సోమరాజుగారు తన భావనలో దాన్ని మూసపోసి కావ్య భాషగా కరిగించారు. ఈభాపలోనే ఉప మలూ, ఉత్ప్రేక్షలూ, రూపకాలూ, అర్థాంతరన్యాసలూ, శ్లేషలూ, ఆయన మెలిపించిన తీరుచూస్తే ఏ రకం భాషకైనా అలంకారమనేది ఎంత సహజమో ఎంత వెఱుగు నిస్తుందో తెలుస్తుంది. ఈ రచనలో ఉన్న సొగసు సగానికి సగం యీ భాషలోనే ఉంది. ఈ భాషలోనే దీనికి పీఠిక వ్రాయలేనందుకు నిజానికి సిగ్గుపడాలి! ఇదిపట్టుబడటం అంతకష్టం. ఈ భాష యీయనకెలా పట్టుబడిందో! ఇదిమన భాషాకాదు సోమరాజుగారి భాషాకాదు. కొంత గ్రాంధిక భాషేనా

సులభ మనిపిస్తుంది. పూర్వ కావ్యాలూ, వ్యాకరణమూ. అంటూ దానికొక ఆధారమేనా ఉంది. దీని కటువంటిదేమీ ఉన్నట్టు కనిపించదు. ఆ జనంతో కలసి పోయి బ్రతకాలి ఇదిపట్టుబడాలంటే. అంతకన్నా ఇంకో శరణ్యం లేదు. నిజానికి ఏ భాషేనా కవివల్లే గొప్ప దవుతుంది. నన్నయ్యే లేకపోతే తెనుఁగింత గొప్పదయ్యేది కాదుకదా! లోకంలో ఉన్న భాషే కవియొక్క భావనలోంచి పునర్జన్మయెత్తి కావ్య భాషగా రూపొందుతుంది. కవులకుమల్లేనే దానికి అప్పుడు జరా మరణజమైన భయం ఉండదు. ఈ తత్త్వం విచారిస్తే గ్రాంధికభాషా, వ్యవహారికభాషా అనే యీ కోలాహలం కొంత ఉపశమిస్తుంది. లోకంలోవున్నంత మాత్రాన ఏ శబ్దమూ సజీవమూ కాదు, గ్రంధాలలోఉన్న పాపాష ఏ శబ్దమూ నిర్జీవమూకాదు. శబ్దానికి జీవం కవివాడుక వల్లనే వస్తుంది. లోకంలోఉన్న భాషలోంచి కవి తన భాషను నిర్మించుకుంటాడు. అదేకావ్యభాష. అలాంటి కావ్యభాష విషయంలో ఎవరికీ విప్రతిపత్తి ఉండదు. ఇంతకీ తూర్పు జానపదుల భాష సోమరాజుగారిని వలచి వచ్చింది. ఆయన తన భావుకత చేత దాన్ని కావ్యభాషగా రూపొందించారు.

ఈ భాషలో– ఈప్రజల జీవితాన్నే మేళవించి శీతోష్ణాలూ, కష్టసుఖాలూ అనేరంగులతో రూపంలేని కాలానికి అనేక రూపాలుకట్టి మనయెదుట పెట్టారు సోమరాజుగారు. ఇది చదువుతూఉంటే ఒక చిత్ర పరంపరను చూస్తున్నట్లే ఉంది. ఇంతచిన్న సంపుటంలో రమ్యమూ, జుగుప్సితమూ, ఉదారమూ, అల్పమూ, అదీ – ఇదీ అనికాదు; నానాప్రకార విచిత్రమైన యీ విశ్వమంతా వివిధావస్థలలో మనకు సాక్షాత్కరిస్తుంది. ఒకచోట నవ్వుతూ, ఒకచోట విలాసంగా, ఒకచోట ఆలోచిస్తూ, ఒకచోట బెంగగా, ఒకచోట కన్నీళ్లతో, ఒకచోట కోపంగా అన్నీ అన్ని సజీవ చిత్రాలు! జీవిత సముద్రాంతరం లోంచి చిలికి తీసి నవీ-అనుభవామృత స్పర్శచేత శాశ్వతమైనవీను. ఎన్ని వేసంగుల్లోనూ ఎన్ని వాస కాలాల్లోనూ ఎన్ని శీతకట్టుల్లోనూ ఇవి మాయవు. కరిగిపోవు. ముడుచుకుపోవు. ఈయన ప్రతిభ మంత్రగత్తె. అది యీ రూపాలవ్వారా మనల్ని అరూపం లోకి తీసుకు వెడుతుంది. అరూపాన్ని రూపంలోకి తీసుకవచ్చి మన కన్నుల యెదుటా నిలుపుతుంది.

" సూరునుంచి జారే నీలా నూత్తూ
కుర్రోళ్లు కన్నార్పరు
మబ్బై ఎగిరి నీరై జారే
సెక్రంలో కూసోని
గిరగిర తిరిగితే
సంద్రాల లోతులూ ఆకాశం ఎత్తులూ
సూదొచ్చని ఆలోసిత్తున్నారో యేమో ! " అని 'వోనాకాలం' లో అన్నారు.

అవునుమరి- ఆ కుర్రవాళ్ల కన్నుల్లో సముద్రాల లోతులూ, ఆకాశం ఎత్తులూ ప్రతిఫలిస్తున్నాయి! వాళ్లుపెద్దవాళ్లై 'పొద్దు' వంటి కావ్యాలు వ్రాస్తారేమో !

" గోడల్లోంచి వుబికిన నీలు
సూత్తే ... ...
స్నేకందికొచ్చిన కొడుకు
సచ్చిపోయి
గోడకి సేరగిలిపోయి నోడు
దిగాలుగా
కల్లముందు నిలాత్తాడు ! "

తడిగోడమీద ఇంత హృదయవిదారక మైనబొమ్మ ఈయనే గియగలడు !

" సెట్లు కూలిపోయి
పచ్చలా రాలిపోయి
యీదుల్నిండ
ఆకులు సెల్లా సెదరై వుంటే
యిళ్లన్నీ మొగుడుసచ్చినట్టు
తెల్లముఖ్ఖు ముసుగుల్తో
బెంగనా వున్నాయ్
తెలారే తలికి ! "

ఇది వానకాలాన్నంతా పరచుకుని- ఇవమిత్తడమని చెప్పరాకుండా ఉండే బెంగకు విస్పష్టమైన రూపకల్పన !

" నూరిబాబు తిన్ననైనోడేటి ? సెయ్యిచ్చుక నాగితే
పట్టపగలే సరసమేటని మబ్బురాణీ
సెయ్యిదిలించు కుందేమొ... ... సటుక్కున
ఆకాశం మీద ఐమరంగుల గాజుముక్క రాలింది ! "

ఆకాశంమీద సటుక్కున రాలిన ఐదురంగుల గాజుముక్క మాత్రమే మనకు కనిపిస్తున్నది. కాని దానిచాటున ఇంత శృంగారజగత్తు దేదీప్యమానంగా వెలుగుతున్నది మరి ! ఈయన సృష్టి సంకల్పమాత్రం !

శీతకట్టులో–

" పొద్దుటేలఎండ మా సైతుగా వుంటాది
బెమపడ్డ అడదానిముందే
కూసుండి పోయినట్టు
య్యెండలో సతికిల పడాలనిపిత్తాది ! "

హేమంత ప్రాతరాతపం 'బెమపడ్డ ఆడుది' అట !

" నలిలో పడపలునాగే వోళ్లనిసూసి
నలిదేవుడే
నలెత్తి పోనాడు ! "

పడవలు లాగేవాళ్ళు చలిబాధకు పరాకాష్ఠగా ఉన్నారు !

" నలికి తల్లినా ముగ్గమ్మి
ఈదిలో నిల్సి
ముగ్గో ముగ్గో అంటే
సలో సలో అన్నట్టుంది ? "

ఈ హేమంత వర్ష్యీయసిని ఎన్ని హేమంతోషస్సులకీ మరచిపోలేము !

" కూత్తూన్న కోయిల
సెట్టుకాడ నిలేత్తాది
యిని ఱాని
వో సెట్టయితే సాలనిపిత్తాది ! " అన్నారు ఏనంగి పొద్దుల్లో.

ఆ మాధుర్యాన్ని ఎలా వ్యాఖ్యానించడం ! విని విని ఓ చెట్టయి పోవటంకంటె మార్గంలేదు !

" సిరుగాలితగిలే సాలు
వొంజికేటి తెలీదు
సెక్రవొర్తినా
దాన్ని దోసెయ్యాలనిపిత్తాది ! "

ఆ పరవశించి పోవటం ఆ మాటల్లోనే అనుభవించాలి ! అడవి మొగలిపూల వలపుతో చిక్కపడిన గాలుల్ని దోసిళ్లతోజుర్రుకోవచ్చు! ఆన్నారు వాల్మీకులవారు !

"అయిసుపూటులమ్మతూ సిట్టితండ్రి
అమ్మకడుపులో సిచ్చెట్టి
వొరదెబ్బకు రాలిపోనాడు ! "

" యిసక తిప్పలతో
తయట్ద గోదారి
యెట్టాంటోలకేనా
తిప్పలు
తప్పవన్నట్టుంది ! "

ఇది 'అల్పాక్షరముల అనల్పార్థ రచన !

ఈ రచనలోని సొగసు వ్యాఖ్యానించాలంటే ఒక పుస్తకం అవుతుంది. కానీ - అదీ 'అసమగ్రమే అవుతుంది. గొప్పకవిత్వం ఏదీ ఎప్పుడూ సంపూర్ణంగా వ్యాఖ్యానంలోకిరాదు.

ఇది జానపదుల ఋతుసంహారం ! కాదు- కాదు. ఈ జాతి జీవనంలో యిది క్రొంగొత్త ప్రౌఢ్డు ! పూర్వ ఋతువర్ణనలు చదివి, యిదిచదివితే - ఉద్యాన లతల అందం అడవితీగల అందంముందు బలాదూరు అన్న కాళిదాసు గుర్తుకు రాకమానడు !

రాజమహేంద్రవరం
13.5-72

మల్లంపల్లి శరభేశ్వరశర్మ

సుకవిత

సుకవిత, సవితగా ప్రకాశిస్తుంది, సరితగా ప్రవహిస్తుంది. నవతగా జీవిస్తుంది.

సుకవిత అంటే, ప్రాణస్పందన నిచ్చేది. ప్రగతిమార్గం చూపేది. యుగ ప్రవర్తన చేసేది. జగతిబాధను తగ్గించేది. దైన్యవ్యధను దూర పరచేది. ప్రణయాన్ని చిత్రించినంత రమ్యంగా ప్రళయాన్ని చిత్రించేది. కవితానందం, పండితులకే కాదు, పామరులకుకూడా అని తుజువుపరచేది. ప్రాచీన కవితంతా సుకవితాకాదు. నవకవితంతా కుకవితాకాదు. అందులోను, ఇందులోనుకూడా ఉన్నాయి రెండూ.

రంధి సోమరాజుది సుకవిత ! నవకవిత ! ! యువకవిత ! ! ! పామరుల ఊహలు, పతితుల ఈహలు, సనాధుల బలాలు, అనాధుల దుర్బలాలు, వీటికి మధ్యఉండే ప్రభేదాలు ప్రదర్శిస్తుంది ఆయన కలం ! తన ఋతుసంహారంలో ఆరు ఋతువులను వర్ణించాడు కాళిదాసు. తన "పొద్దు" లో మూడుకాలాలను వర్ణించాడు సోమరాజు. వానాకాలం, శీతకట్టు. ఏసంగిపొద్దులు.

కాలాన్ని వర్ణించట మంటే వాతావరణాన్ని వర్ణించటమే కాదు; ఆయా ఆకాలాల్లో ప్రజలుపడే ఆనందాలను. నిరానందాలను ప్రజలుచెందే ఆశలను, నిరాశలను, వెలుగులను, నీడలను వర్ణించడం !

సోమరాజుది ఎక్స్‌రే కలం. సమాజపు నిమ్నస్తరాల్లోని పామరజనుల హృదయాంతరాళాల్లోని పొరక్రిందిపొరను దూసుకొంటూపోయి ఆయన కలం చూస్తుంది. అట్టడుగున సుప్తమైన గుప్తచేతనను పామరుల పలుకులతో వ్యక్త పరుస్తుంది ! చూడండి వర్షాకాలపురాత్రిని ఎంతఎంతగా వర్ణిస్తాడో ....

" క్రిస్సాయికి తనేపు సూసే కల్లిమ్మని మినుగురు పురుగూ
మినుగురు పురుక్కి తనపాటినే సెవులిమ్మని క్రిస్సాయి

వానదేవుడికి వో మెక్కుతూన్నట్టు
రేత్రంత వో మినుకు మినుకులూ
వొకటే కీసురాల రొదలూ
మడ్సులంతా ఇంతేనొరే ...
అంతా తామే గొప్పోల మనుకుంటూ
తమసొదే ఇనమంటారు. ”

వాన్లల్లోవొళ్ళు తడుస్తాయి. వొళ్ళుతడిస్తే యిట్టే ఎండిపోతాయి. ఇళ్ళు తడిస్తే ఓ పట్టాన ఎండవునురి అందుకే అంటాడు —

“ఇల్లార్పడానికి
నీల కార్లెట్టినట్టు
ఇళ్ళేండయ్యడానికి
యెండకార్లెట్టినా బావుండేది.
పెబుత్తమోరు ! ”

కళ్ళకు రూపంగా సొంపూ, చెవులకు నాదంగా ఇంపూ, “పొద్దు” లో ముద్దు ముద్దుగా మృదువుగా సమ్మేళించినాయి. ఈ కవి కలం; కుంచెద్వారా, మురళిద్వారా, కుంచెలోని రంగులుగా, మురళిలోని రాగాలుగా రూపొందుతుంది!

సోమరాజు కవిత సామాజిక సెటైర్. అందుకే అంటాడు తన “శీత కట్టు” కవితలో

“ కురిసే మంచునంతా
దగ్గరగా నాగేనుకోని
గడ్డకట్టించే మిసనుంటే
ఏనంగిలో అమ్మి
డబ్బు సేసుకుందు నంటూ
వో మిల్లోడు మాసెడ్డ బెంగడి పోనాడు ! ”

ఎంతటి సహజోక్తి ! సంపాదనపై ఎలాంటి ఆసక్తి !

సోమరాజు ఏదిచూసినా, ఏది వ్రాసినా అదొక కిరణం ! అందరివలె కళ్ళతో చూసినా, అందరివలె కలంతోవ్రాసినా ఆయనచూసే చూపువేరు ఆయనవ్రాసే రూపువేరు !

"ఏసంగి పొద్దులు" కవితలో

" నీలెండబెట్టవేం అని
వోడో నూరీడి నెత్తిమీద కూసోని
గొడ్డును బాదినట్టు బాదుతావుంటే
యెండసిన్నోడు
వొగుర్తూ యిడ్సిన గాలేనంట
యీ వొడగాడ్పు ! "

ఔను! ఆయనకవితలోఉంది గుంతెకుచెందిన అనుర క్తి ! మేధకుచెందిన యుక్తి ! ఔను ! అనుభూతుల మాధురికి ఆలోచనల వెలుగు అతికితే కవిత రసాత్మకం ! ఆ కవిత కాంతి మంతం !

శ్రవ్యపథాల్ని దృశ్యరూపాల్లోకి రూపొందిస్తాడు సోమరాజు.

"పొద్దు"లోని కవితలు, మాటల మణిదీపాలు. మనస్తాత్విక రూపాలు. వాస్తవిక నవజీవన బింబాలు !

తుమ్మపూడి
16-5-72

సంజీవదేవ్.

సిన్నోడు కాడి సోమరాజు

అబ్బో ! ఏమో అనుకున్న. సిన్నోడు కాడి సోమరాజు. పెద్ద కైత్కా లోడు (కవిత్వాలవాడు). మా అసొంటి (అటువంటి) సిన్న కులపోల్లు జెప్పు కునే ఆల్కటి (తేలిక) బాసల యెన్నెన్ని యిసిత్రాలు జెప్పిండు. మేం అనే తీర్గనే రాస్తడు. కాని ఈయన సేతిల యేం మయిమ వుందోగాని అందరికి ఎరు కున్నదే మా ముద్దుగ జెప్పుతడు. ఒకపారి యెన్నపూస తీర్గ ఇట్లనే యిడదీసి సూపుతడు. ఇంకోపారి యెండికొండంత యెదిగి అందకుండ పోతడు. ఏది జెప్పినా యెంత గొప్పగుంటదని. వానకాలం యెట్లుంటదో ఈయన రాసింది సదివితే పెయ్యంత (ఒళ్లంత) ఆవిరి లేస్తది సంబ్రంతో. ఇగ జూడుమరి

"యెండలు పేనాలు తీత్తే
వోనలు పేనాలిత్తాయి.
అందుకే నొరే
యెండ లెములోలు
వోనలు సల్లని తల్లులు"

అబ్బ! రుసితీర్గ (ఋషివలె) జెప్పిండు. ముక్కా సెప్పలూ మూసు కొని కాదు. రుసి (రుచి) పుట్టేటట్టు జెప్పిండు.

కాలాలమీద కైత్కాలు గిలికిన గొప్పగొప్పోల్ల తల దిరిగి పొయ్యేటట్టు రాసిండు. ఎక్కడ జూసిండో ఇవన్ని ? ఆఁ ఆఁ. ఎరుకైంది. ఈయన కండ్లల్ల 'లచ్చ యెలుగు లున్నాయి". లేకపోతె ఇన్ని ముచ్చెట్లు ఇంత సుతారంగా చెప్పే తెలివి ఎక్కడినుంచొస్తది.

ఇదుగో. సివరి సిపరికి ఈయ నన్నమాట నా పానాలను యిపరీతంగా గుంజుతుంది. గదేందంటే — యెండకాలంల —

" సిగ్గేసి సిన్నది సిన్న నవ్వు నవ్వితే
ఛస్. ఆ నవ్వునా ఎలగనేక పోనానని
సూరీడు సిగ్గుతో సత్తడంతే "

ఎట్టెట్టా ? సూర్యుడు సిగ్గుతో జస్తడా ? సోమరాజా సంపితివివో. నీకింక సావులేదుపో.

హైదరాబాదు }
10–6–72 }

నారాయణరెడ్డి

పూజ్యులు డాక్టర్ సి. నారాయణరెడ్డి గారు
ఎంతో ప్రేమతో పంపిన
మై అభిప్రాయానికి
నా కృతజ్ఞతాభి వందనములు.

రంధిసోమరాజు

మోనాకాలం

వోనాకాలం

వోనా కాలం వొత్తే సాలు
వొల్లు కుందేలు పిల్లనా
గెంతు లేత్తాది

జల జల సినుకు లడ్తా వుంటే
సమర్తాడిన గుంటలు
సెమ్మ సెక్క లాడ్తున్న ట్టుంటాది

సూరీడ్ని సొక్కా జేబులో ఏసి
మూ సేత్తున్నట్టు
సెనంలో మబ్బులు
నోకాన్ని మూసేత్తాయి

యెండలు పేనాలు తీత్తె
వోనలు పేనా లిత్తాయి
అందుకే నొరే
యెండ లెము లోలు
వోనలు సల్లని తల్లులు

వోనలికి కొత్త తలుపు సెక్క లెదిగి
సచ్చినోడి పల్లనా బిగుసుకు పోతే
తెల్లారగట్ట తలుపుల్తో కుత్తీ పట్టి పట్టి
భడాలున అయ్యి వూడొత్తే
కొత్త మొగుడూ పెల్లాలు
వోరు మీద వోరు పడిపోయి
వొకటే సిగ్గులు
ఆ సెసంలో ఆల్ని సూసినోల
కల్లల్లో లచ్చ ఎలుగులు !

నులక మంచం బిర బిగుసుకు పోయి
వొంకర్లోతే
కుర్రోలు ఈమూల తొక్కితే
ఆ మూల లేత్తాది
ఆ మూల తొక్కితే
ఈ మూల లేత్తాది
అలిగిన పడ్సు పెల్లాం
మూతి తిప్పుళ్ళనాగ

తంధి
సోమరాజు

వోనలో నా న్నాని (నాని నాని)
బాతులు రెక్క లార్సుకుంటూ
"వోన నొగ్గిసి మేం రాం" అన్నట్టు
తోక లడ్డంగ ఆడిత్తాయి

పిసరంత పంచదార కిందడ్తే సాలు
సవాసే రీగలు ముసురుకుంటయ్
గోడ కింత సెమ్మతగిల్తే సాలు
పుట్టెడు సెదలు పురపుర లే సొత్తాయి
ఆటికిమరి ఆ నీలే పంచదారేమో !

సాక లోడు
ఎండ ల్లేక ఎగనాం ఎడ్తే
ఇల్లల్లో గుడ్డ ముక్కలు కంపెత్తి
సివా లెత్తినట్టు గాలి పీల్సు నివ్వవ్
ఏగం సుఖ పడాలని
ఆటి కెం తా రాటమో !

జోడు నేక వోనల్లో
అరికా ళ్ళారిసి పోయి
కాలి మడమల్నిండ
జల్లిడి బొక్కలే ....
ఆలాటి కాళ్ళతో
కట్టపడ్తే
కట్టమే రాలుద్ది మరి !

రంధి
సోమరాజు

అసలు గుద్దులాట లాగిసచ్చినా
మూల మూలల్లో యుద్దం మిగి లున్నట్టు
ఆరబైట వో నెల్సిపోతే
సెట్టు కింద వోన సిటపట మంటాది

డబ్బుండాల కాని
కోడి మాంసం గారెలు
తింటా వుంటె
వోనాకాలం
సొరగ మెహె !

వోనకి మట్టీ యిసకా కొట్టుక పోయి
కంకర్రోడ్డు నిండా లెగిసిన రాలు
దొంగ రాలు గాయి కొన్ని లేర్ల
రంపం పల్లనా వుంటాయి !

బుల్లెమ్మల గుడ్డల నిండ
బురదనీలు తూలి
డైవోరు గాడి సరదా తీరుత్తాయి
ఈ లున్నో డల్లా
యేడిపిచ్చడాకే సూత్తాడొరే ....

ఆకు జోడుతో పట్టిపట్టి నడ్వక పోతే
ఎనకేపు వోన్నీలు (వోననీలు)
సొక్కా సెవులు దాక

రంధి
సోమరాజు

బురద బొ ట్లెడతాయి
సుకంగ నడ్సెల్తన్నాం అని
సంబరపడ్తే సాలేటి
ఎన కే టొతూందో అని
సూసుకునే నరుకుండాల !

వో నొచ్చినేల యీదుల్లో
గుడ్డి ఎలట్టీ దీపాల కింద
నీ ల్లేని సోట నీ లున్నట్టూ .
వున్న సోట లేనట్టూ
కల్లు తిరకాసై పోతాయ్
మాయంటే యిదే నొరే....

గోదారి పూటుగా వొత్తే
సూడ్డాని కొచ్చే పట్టుసీర్ల రాణీలు
బిడ్డికాడ ఈదుల్లోని నీలు సూసి
సీర్ల కన్ను వొల్లే సిగ్గు లేన్దని
గుడ్డ లెత్తుకోని నడుత్తారు !

వోనలో ఎలిగే బల్బులు
సిన్ని సేమంతి పూరేకు మొనల్లాటి
సిరు సెమటతో మెరుత్తూ
సల్లని కిరనాలవోన కురిపిత్తయ్
సిన్ని బుడ్డిసూరిదేవుళ్ళనాగ

తంధి
సోమరాజు

మంచమేనా ఇరగాల
సానైనా (సాని అయినా) సావా లన్నట్టు
వో బూమిని
యిరగ బొడిసేత్తాది వోన !

మందేసి కోరీలని
దెబ్బకి బద్దలు సేసినట్టు
ఆకాశెంలో
ధన్‌ధనామని బద్ద లౌ ద్దొరే మబ్బు !

సల్లని గాలి తాకిడికి
సుకంగ కరిగిపోద్ది మబ్బు
గొప్పోలు అలా పేదోల గుండెల్ని
కరిగి త్తే
నోకమంతా ఔద్దొరే
వొకటే సేమంతి పువ్వు !

జెర్రిపాకినట్టు
ఆకాశెం మీద సూడు
ఎలా పాకుద్దో
మెరుపు !

యెంత కాలాని కెంత కాలానికంటూ
ఆకాశెంలో మబ్బులు
ముద్దు లాడ్తా వుంటే

రంధి
సోమరాజు

ఆ ముద్దు లందం
యీ మెరుపు ముక్కలంట !

ఏసంగిలో ఇం తో నొత్తే సాలనుకుంటాం
వోనలప్పు డిం తెం డొత్తే సాలనుకుంటాం
అంతేనోరే.... అంతే....
వుత్త సంటోడి బుద్దనుకో....
ఇంతకీ మనం కాలం సేతిలో సంటోలం కాదేటి ?

సెయ్యి ములగ డబ్బుంటే
వోనాకాలం
సానిలా సైసై అంటాది !

ఇనాయకుడి పాదాల కాడ
సదువు రావాలని కుర్రోలు పుత్తకా లెడ్తే
తూకం రా లెట్టి నాడు సావుకోరు
పేక దర్తా లెట్టినాడు పేకాట గోడు
ఈ లంతా బత్తులే కాబట్టి
వోడిమాటా యినక పోయినా
బెంగ నే దనుకున్నాడు కొంటె దేముడు !

ఎలక్కాయల్ని సూత్తే
సుతారంగా ఎదిగిన గుంట లానారు
ఆటి రుసి
మా కసిగా వుంటది !

రంధి
సోమరాజు

పంపర పనాసకాయ తొన లొల్సి సూడు
పల్సటి సీరల్లోని వొల్లునా గులాబీ నీటి జోతులు
ఎల్తిగి పోతాయి
నాలిక మీదెడ్తే వారెవా (.... అంటాం

ఎన్ని సీతాపల్లు తిన్నా
అదేటో
ఆ ఇట్టాని కీట్టమే గాని మరో అడ్డుండదు
పానకంలో పుడకనాగ
పిక్క లొక్కటే అడ్డు !
ఆటిని తిని తిని
ఇన్ని నీలు తాగితే సాలు
వొంటికేటీ సెయ్యిదు !

నిప్పుల మీద కాల్సి
నేత మొక్కజొన్నపొత్తు లిత్తే
అమ్మాయి జెబ్బలు కొరికేత్తున్నట్టు
కొరికి నమిలేత్తారు !

పీక మొయ్య మెక్కి
కాళ్ళు సాపుకోని
వూసులాడుకునే ఆడోల్లాగ
సెర్వుకాడ వో బెక బెక లాడ్తాయి కప్పలు
తెల్లార్లూ ....

రంధి
సోమరాజు

కీ(సాయికి తనేపు సూసే కల్లిమ్మని మినుగురు పురుగూ
మినుగురు పురిక్కి తన పాటినే సెవు లిమ్మని కీ(సాయీ
వోన దేవుడికి వో మొక్కు తూన్నట్టు
రే(తంత వో మినుకు మినుకులూ
వొకటే కీసురాల రొదలూ
మడ్డులంతా ఇంతే నొరే ....
అంతా తామే గొప్పోల మనుకుంటూ
తమ సొదే ఇనమంటారు !

వోనపిల్ల పూటుగా కల్లుతాగినట్టు
గాలి తిప్పినట్లెల్ల గరగనా గెంతులేత్తే
తాటే క్కొంపల కప్పు ల్లెగిసి పోయి
అయ్యో గెంతులేసినాయి
సినేమాల్లో గుడ్డలొల్పేసుకోని కుర్రది గెంతు లేత్తావుంటె
సూత్తూన్న కుర్రోలు వో వొంక గ్లోయి నట్టు !

తెల్లార్లు సూరు నుండి
సిదుకు సిదుకు మని
సినుకు లత్తా వుంటే
నిద్ద రేటడ్డి
సెవికాడ వొకటే
ముసిలోల సనుగుడు నాగ
పై కెగర్ని వోనరోకళ్ళ
దంపుళ్ళ పోటు !

రంధి
సోమరాజు

ఎంత యిట్టమైతే మా త్తరం
వొదల కుండ వోన కురి త్తే
వొద్దు మొర్రో అనిపిత్తా ది
తినగా తినగా తీపి సేదెక్కి నట్టు

పేదోళ్ళ గుండెలు
కబుర్లకీ
మట్టిళ్ళు వోనలకే
కరిగి జావ జా వై పోతాయి

గాలి వోన బాదుళ్ళో
దొంగలు గోడలు తవ్వే సప్పుళ్ళో
తెలవక
గుండె లర సేతిలో ఎట్టుకోని
పైకి మా త్తరం
"అబ్బా సలి" అంటారు
పెల్లాల సందిట నక్కిన పిరికోలు !

ఏలెట్టి
ఆకాశెం కంటిలో పొడి త్తే
కారే నీలలా
వొకటే వోన !

సెట్లు తెల్లార్లూ ఏడు త్తాయి
గుండెలు బాదుకోని

తండి
సోమరాజు

ముక్కు సీదు కోని
కొడుకు తన్ని తోలేసినట్టు
వొకటే గోల !

తాటే కిళ్ళల్లో
కారే సోట్లెల్ల
కర్వ లోరెట్ట గ(లు ?
నెత్తిమీద సినుకులు
సిటుకు సిటుకున
మొట్టికాయి లేత్తా వుంటే
కూసోని కునికినాం
తెల్లార్లూ జాగరమే !

తెల్లారే తలికి
యిల్లంత పొక్కిపోయి
అంతాపనే... యింటిది
మట్టి మెత్తిమెత్తి
అలకనే కలక నేక సచ్చింది !

యిల్ల కప్పుల మీద
దారి తెలియనట్టు
పొగ నిల్సి పోనాది
ఏ వూరెల్లాలో మరి
ఆ పొగపిల్ల !

రంధి
సోమరాజు

డాబాయిళ్ళు నానిపోయి
కన్నాల్లేని జల్లెళ్ళాతాయి
పైకి కోరిక ల్లే నట్లానే సాములోరి
కడుపునిండ కోరిక లున్నట్టు
ఆటిలోంచి రాలే సుక్కలోన
సిదికి పోయినోడి నెత్తి మీద
మంటలోన !

ఇల్లార్పడానికి
నీల కార్లెట్టినట్టు
ఇళ్ళెండయ్యడానికి
యెండ కార్లెట్టినా బావుండేది
పెబుత్తమోరు !

వోనలకి జడ్సిపోయి
కుక్కలు
తోకాడించడం
మానేశినయ్

ఆడోళ్ళ వొంపులు కోసరం ఆరాటపడే డైవోరు
రోడ్డు వొంపు లంటే
ఆరిసేతిలో పేనా లెట్టు కోని ఎల్తున్నాడు !

సెటు కూలి పోయి
పచ్చులురాలిపోయి
యీదుల్నిండ

రంధి
సోమరాజు

ఆకులు సెల్లా సెదురై వుంటే
యిళ్ళన్నీ మొగుడుసచ్చినట్టు
తెల్లమబ్బు ముసుగుల్తో
బెంగనా వున్నయ్
తెల్లారే తలికి !

సిల్లులున్న మాసికల గొడుగునా నో కం వుంటే
ఆ కన్నాల కింద కన్నుల్లా మడ్సులు !
ఆల కనుగుడ్డుల్ని శెనశ్శెనం శూలాలై పొడుత్తాయి
పన్నుల్లా వోన్నీలు

గోడల్లోంచి వుబికిన నీలు
సూ తే ....
సేతి కందికొచ్చిన కొడుకు
సచ్చిపోయి
గోడకి సేరగిలి పోయినోడు
దిగాలుగా
కల్ల ముందు నిలుత్తాడు !

ఆటలాడు కోడాని కీలుగా నేదని
కుర్రో లొకటే యేడ్సు
పేకాటగాలకి మా త్తరం
పేనం లే సొచ్చి నట్టున్నాది !

రంధి
సోమరాజు

సీసి .... అంతాసీదర
యీదుల్లో కాళ్ళెట్టనేం
లబ్బరుజోడు తొడుక్కోన్నోలు
మంటల్లోంచి దర్జాగా నడ్సెల్తున్నట్టు
సుకంగ ఎల్లిపోతారు
బురదలో వుత్తి కాలు ఎట్టాలంటె
పేనం పోద్ది !

సూరు నుంచి జారే నీలు సూత్తూ
కుర్రోళ్ళు కన్నార్సరు !
మబ్బై ఎగిరి, నీరై జారే
సెక్రంలో కూసోని
గిరగిర తిరిగితే
సంద్రాల లోతులు. ఆకాశెం ఎత్తులు
సూడొచ్చని ఆలోసిత్తున్నారో యేమో !

పట్టనాల్లోని బజారుల్లో
మడ్సుల నెత్తిమీద గొడుగులు
ఎగుడు దిగుడు తార్రోడ్డునా వుంటాయి
మేడ మీదున్న కుర్రోలు
దానిమీద వో సిన్ని కారు
తోలా లను కుంటారు !

రంధి
సోమరాజు

కిటికీ కాడ కూసోని బుల్లెమ్మ
దిగాలుగా సూత్తాది
సినేమా వోలకి
నట్టమొత్తోందనో యేమో !

కొట్టు మీద కూసున్న సావుకోరు
కురుత్తూన్న వోనంతా
పిట్టోలో కిర్సనాయిలో ఆయితే
గాలిగోడ ల్లేపి గొవాము లేస్దేద్దు ననుక్కుంటున్నాడు
ఆ గొడాంకి తాళంగ
ఆడె అతుక్కుపోతాడో ఏమో
వోడ్డూ ఎత్తి కెల్లకుండ !

గేస్‌పొయ్యిమీద కూడొండుకోని
ఆడోళ్ళు గవ్వలాట లాడుకుంటూ
గువ్వల్లా కులుకుతారు
సద్వుకు న్నాడోలు
పుత్తకాలేపె సూత్తూ
ముత్తే లల్లె మెరుత్తారు
పేదోలు మాత్తరం
తడ్సిన పుల్లల్ని రాజేసే నిప్పురవ్వ నేక
పక్కింటి తల్లి దరమమా అని
ఇంత నిప్పు పుడ్తే
వూది వూది

రంధి
సోమరాజు

పొగకు కప్పుల్లా వుబ్బిన కళ్లతో
పొయికాడ సత్తా
దవడలు నొప్పెట్టి
'సీ' అంటూ సేతిలోని గొట్టం నేల కీసి కొట్టి
మేం వొండనేం దేవుడోయ్ అని సత్తే ఏడ్వరు
మొగుడు సచ్చినోడు
వుత్త తడి మొద్దులు మోసు కొచ్చాడని
ఆడి మీద వొంటికాలి మీద లేత్తారు !

నీరెండ ఎలుగునా
పెబుత్తం వుంటే
యెండ మావుల్ని నిలేసి ఎడ్లాల్లే పండిత్తాం !

వోన దొరసాని
యెడ తెరిపి నేకుండ
గాన కసేరీలు సేత్తె
గూని సాకలాడు కూని రాగాలు తీసినాడు
ఎంతసెట్టు కంత గా లన్నట్టు !

సూరిబాబు తిన్నసై నో డేటి ?
సెయ్యిచ్చుకు నాగితే
పట్టపగలే సరస మేటని మబ్బు రాణి
సె య్యిదిలించు కుందేమొ .... సటుక్కున
ఆకాశెంమీద ఐదు రంగుల గాజుముక్క రాలింది !

తంధి
సోమరాజు

సెందురిడి సుట్టు
సిన్ని గుడి సుట్టి
సెక్రాల జుట్టు
నోకాని కిచ్చి
ఎయ్యి రూపాల
ఎలిగి పోనాది
పొయారి మబ్బుల
వోన పిల్ల !
ఆమార్పు లలాగె సూసి
వొల్లేటి కన్నేటి
సెదిరిపోతె
ఆ వొంపులూ సొంపులూ
తెచ్చుకోనేక
వోన రాణీ వొల్లునా మారిపోనేక
బొందె లడ్డొచ్చి
యేట్నేటి బొట్టెలకు
యెల్లి పోతూ యెల్లిపోతూ
వొంటి సొంపులు
మార్సుకో నేకపోతే
కోకలైన మార్సుకోండని
కవ్వించి సెప్పింది
మా సెడ్డ మాయిదారి
సిత్తాంగి వోన !

రంధి
సోమరాజు

అందుకే అందుకే
ఎన్నెన్ని కొన్నా
కోకో (కోక+ఓ) కోకో అంటారు
కొంటె పెల్లాలు
వొయసులో వున్నది
మొగుడో మొగుడో అనుకున్నట్టు
కొని సావ నేక
సలెత్తి పోయినట్టు
వొనికి పోతారు
సిల్లి గవ్వ లేని
సిట్టి మొగుళ్ళు !

శీతకట్టు

శీతకట్టు

గోదాట్లో నీలు
నలుపు తిరిగి
సెందురుడికి కన్ను గీటాయి
గుండెలోకి రమ్మంటూ ....

సూడు., వొంటి నిండా
వొజ్రాల సుక్కలతో
ఎలిగి పోయే
ఆకాశెం బులి
దొంగోడి పెల్లాం
గౌరి దే వన్నట్టుంది!

పక్కలొంచేత్తోంది తస్సాదియ్యని సలి
మడ్సుల వొల్లే దానికి పక్కేమొ !
సిట్ట సీకట్లో దుప్పటి సరిసేత్తున్నట్టు
వొల్లంతా తడి వేత్తోంది !

తెల్లారగట్ట నో రిప్పితే సాలు
మిల్లు గొట్టాల్లోం చొత్తున్న ట్టొత్తోంది పొగ
మంచుమిల్లు నోట్లో
పిల్లల్నిగాని ఎట్టిం దేమొ ?

రేత్రి పొలాల మీద
పక్కనున్న మడ్సినే
'ఎక్కడున్నా వెహె'
అనాల్సొత్తోంది !

కాలికి సిన్ని బెడ్డముక్క తగిత్తే సాలు
పేనం లెగిసెల్లి పోద్ది
ఆడబొడ్సు సిన్ని మాటంటే
బుల్లి పేనం గిల గిల్లాడినట్టు

సలిదొరగోరి రాసరికంలో
సూరీడుగోరు కోమటోడినా
మీసం కిందికి దించేసి నాడు !
కాలానికి వోడేనా
తలొగ్గ వొలిసిందే నొరే !

రంధి
సోమరాజు

డప్పులు మోతె త్తించి
పులిని తో లేసినట్టు
మంట లేసుకోని
సలిని తోలెయ్యాల!

పొద్దుటేల ఎండ మాసైతుగా వుంటాది
బెమపడ్డ ఆడదాని ముందే
కూసుండి పోయినట్టు
య్యెండలో సతికిల పడా లనిపిత్తాది!

శేనాసేపు యెండలో కూసుండిపోతే
యికారం ఎత్తుద్ది
పెలాం కాడెనా ఆటే కూసుంటే
సికా కెత్తదేటి!

మొగుడు బుగ్గలు కొరికేత్తే
అలిగి దూరంగా బబ్బో వొచ్చు
సలి కొరికేత్తే
ఎటెల్లాలో తోసనేదు బుల్లెమ్మకి

గొడ్డళ్ళతో సీల్సినట్టు
పాదాల్ని పగలేత్తాది
సలిదేవుడి పెల్లాం
పుల్లలు తెమ్మందేమో

రంధి
సోమరాజు

పెదాల్ని నిలువునా సీరేసి
జలగనా పీల్చేత్తాది రగతం
యింత యెన్నపూస పామితే సాలు
తోడ బుట్టిం దను కోని
పక్కకి తప్పు కుంటాది

కొంటెపన్లు సెయ్యిమని
అట్లతద్ది బోగిపండుగ
యేటికో తూరి
కుర్రోలకి కేయిత్తే
సా ల్లేదని రోజూ యిచ్చేసు కుంటున్నారు
'కీలు'; రౌడీ కుర్రోలు
ఆల క్లీల్లిరగ్గొడితేగాని నాబం నే దన్నట్టు
రయ్‌ని ఈత్తోంది సలి

రెండో ఆటకి సినేమాల కాడ
జెనం సప్పగా పల్సబడి పోనారు

ఏరుసెనక్కాయిలు తింటూ
సినేమా కట్టాలు సూసి
కన్నీ లెట్టుకునే కుర్రోలకి
ఈడిలో గేటు ముందల సలిలో కూసోని
సెనక్కాయలమ్మే ముసిలిముద్ద
వొక్కసారీ కల్లల్లోకి రానే దదేటి సిత్రమో !

రంధి
సోమరాజు

సినేమా వొదలగానే రిక్సాలో కూసోని
మొగుడూ పెల్లాలు సలెత్తి పోతూ
"ఉహు .... ఉహు .... అని దగ్గరడి పోతావుంటే
రిక్సా వోడి గుండెల్లో తాపం పేట్రేగిపోయి లెగిసిన మంటలు
ఆడి సలిని తోలేసి వుంటై
నేకపోతే ఆంత సలిలో రిక్సా తొక్క గల్డేటి ?

సలిలో పడవలు లాగేవోళ్ళని సూసి
సలిదేవుడే
నలెత్తి పోనాడు !

మాటాడ కొరే
కల్లిప్పి సూడు
సెందురుడు సలిసంద్రాన కూకోని
తపస్సెత్తూ
ఎన్నె ల్నెలా
దారోత్తున్నాడో ....

ఎంతకీ తెల్లారదు
తొంగోనేక తొంగోనేక
నడుం
పచ్చి పుండై పోనాది !

ఆ సెత్త ఈ సెత్త పోగేసుకోని
అడుక్కునే వోలు తూముల కింద

తండ్రి
సోమరాజు

మంట లేసుకోని
గుడ్డ లంటు కునేదీ లేన్దీ
సూసు కోకుండ కునుకు తున్నారు !

కురిసే మంచు నంతా
దగ్గరగా నాగేసుకోని
గడ్డ కట్టించే మిస నుంటే
ఏసంగిలో అమ్మి
డబ్బు సేసుకుందు నంటూ
వో మిల్లోడు మా సెడ్డ బెంగడి పోనాడు !

అమ్మ కోసిపెట్టిన జున్నుముక్క
సలికి గడ్డ కట్టిన
సేందురుద్నా వుంది

కడుపుతో వున్నోలకి
రేగుబళ్ళ వొడియా లిచ్చి
పొట్టలోని పాపాయిలికి సలిరుసులు మప్పింది !

రేత్రి కూసింత దూరం కూడ
ఆపడ్డం నేదు
కంచు కాగడా లేసుకోని బస్సు
కత్తిమీద సాము సేత్తున్నట్టు
రోడ్డుమీద జాయిగా పడ్వనా ఎల్తోంది !

తండి
సోమరాజు

పగలు - ఎదవగొడ్డు లడ్డం పడ్డాయని
బుడ్డోణ్ణి తన్నిన డ్రైవోరు
రేత్రి లారీ కడ్డం నిల్సిన పొగమంచును
వోడు తోలు తున్నాడో తెలవక
పాపం పండిందని వొనికి పోనాడు !

సలిని మింగేసే దెయ్యంనా
రేత్రి రైలు పరిగెడ్తావుంటే
తలుపులూ కిటికీటీలు మూసీసుకోని
వుండసుట్టుక పోయి నోలకి
ఆ లి ల్లల్లోనె బండి నిల్తే
ఎచ్చగా దిగొచ్చనిపిచ్చింది

బూతాల్లాటి మిలట్రీకోట్లు తొడుక్కోని
సెవుల్కి మఫ్లేర్లు సుట్టుకోని
మూరెడేసి బేట్రీన్రైట్లేసుకోని పోలీచోలు నడు త్తావుంటే ....
ఆ లొంట్లో నీల్లు నాగేసి
సెయ్యిపనితనం సూపినాది దొంగసలి !
దాన్ని ఏయిడంగా పట్టాలో తోసక
ఆలు కొయ్యబారి పోనారు !

కొబ్బరినూని సిక్కగా పేరుకపోయి
పేరుకున్న నెయ్యినాగ ముద్దగట్టుక పోనాది

తంధి
సోమరాజు

పొయ్యికాడెడ్తే మల్లీ పేనం పోసుకుంది
అత్తోరింటికాడ ముడ్సుక పోయిన బుల్లి
అమ్మగోరింటి కాడ కల్విడిగా తిరిగినట్టు !

సన్నీలలో ఏలెడ్తే
అయ్యి జివ్వున కర్సేసినాయి
కొత్తగా పల్లొచ్చిన సిట్టి పాపాయినా

బుజంమీద
నిండాలేని కుండలో
వూగీస లాడే నీలనా
వొనికి నత్తోంది గుండె !

ఈదిలో కుక్కలు
మొరగడం మర్సిపోనాయ్
దవడ్లు సలికి అంటేసుకు పోనాయో ఏమో !

కుక్కిమంచం క్రింద
కుంపట్టెట్టుకోని
గుడిసెలో ముసిల్ది మా ఎచ్చగా బబ్బుంది
పెద్దలోగిల్లలో
శాలువా సుట్టేసుకోని
ముడ్సుకుపోనారు
ముసిలిపడ్సు రానీలు

తంధి
సోమరాజు

గోడాట్లో వొక్కదెబ్బని
బుడుంగున మునిగే త్తే
వొంటికి యెచ్చగా వుంటాది
వొడ్డునే సలిసలి ఆంటూ
గెంతు లేత్తే —
సలి నాకేత్తాది !

తెల్లార గట్ట
గోడాట్లో
ఆరటి దొప్పల్లో ఆడో ళ్ళాదిలిన దివ్వెలు
సుక్కలికి తల్లిసుక్క లెట్టిన బువ్వ లొరే !

కార్తీక మాసంలో
గోడాట్లో ములిగే ఆడోలు
తడ్సిన బట్టల్తోనే యిల్ల కొత్తారు
ఆందుకే నొరే ....
ఆడోల గుండెలు సెంచలం అన్నోడు సచ్చెదవ !

నల్ల
సిలికి సిలికి
అమ్మ
సిట్టిగాడ్ని యీపుమీద సెయ్యేసి లపేతలికి
అయ్యి బాబో అని కెవ్వు మన్నాడు
కరెంటు సాకు తిన్నట్టు !

తంధి
సోమరాజు

ఎప్పుడూ నేదు గొల్లమ్మి
సిక్కని పా లోసింది
రేత్రి ఎన్నెల్నికాని పిండుకుందేమో !

సలికి తల్లినా ముగ్గమ్మి
ఈదిలో నిల్సి
ముగ్గో ముగ్గో అంటే
సలో సలో అన్నట్టుంది !

సెద్మాన్ని తినెయ్యడంలో
సలికి ఈడైనోశు నేడు
వొల్లు బిడబిడ్లాడి పోతావుంటే
యింత సమురు సుక్క పామితే
సలిగాడి ఆట కడ్డి
కరెంటుకి లబ్బరు ముక్కనాగ !

ఏటీ రుసిగా నేదు ఎదవ కాలం అని
నోకం శోకాలు తీ_త్తె
సెరకు ముక్కిచ్చి
సూసుకో నా మజాకా అంది సలి !

ఆకులు రాల్సేసి
ఎమికలు బయిటెట్టేసినాదని
దిగాలు పడ్తావుంటే

రంధి
సోమరాజు

సిట్టి సూరీడ్ని బంతి పూలు సేసి
కల్లని కుట్టేసి నాది !

పాడుముండా కాలం ఆని సలిని
తిట్టుకుంటా వుంటె
"నీ క్కల్లు నేవ్" అంటూ
పొలాల్లో కుప్ప లోసిన
బంగారాన్ని సూపింది

కొత్త బియ్యంతో అమ్మ
తాజాబెల్ల మేసి
పాలజావొండితే
వొలసిన సిన్నదాన్ని
కట్టేసు కున్నట్టుంది !

సెక్కరవొర్తిని తగిలేసి
పెజాసామియం తలెత్తినట్టు
మంచును
సూరీడు సిల్సేత్తే
పుట్టుకొచ్చి న
ట్టెగురు తున్నయ్
పాదుల మీద
సీతాకోక సిలకలు !

తండ్రి
సోమరాజు

తడ్సిన బట్టలిట్టే పొడి పొడ్లాడతాయి
బూమి బీట్లారుద్ది
పాపం యెక్కడ లేని నీలు తాగేత్తాది సలి!
కోరుకున్న వొసంతంబుల్లి
సేతి కందే దాక యిలాగే
తాగుద్దేమొ తాగుమోతు సలి!

వీసంగిపొదులు

వీసంగి పొద్దులు

ఎనకేపు మల్లె పూ లందం సూత్తే
ఓరి దేముడోయ్
ఆ మొగా న్నడేటో
వో సూడా లనిపిత్తాది
సూత్తే యేటుంది
ముసిని పిక్కల ముసీలి మొగం
పెట పెట లాడుద్ది ఎండనా !

కూత్తూన్న కోయిల
సెట్టు కాడ నిలేత్తాది
యిని యిని
వో సెట్టయితే సా లనిపిత్తాది !

సిరు గాలి తగి త్తేసాలు
వొంటి కేటీ తెలీదు
సెక్రవొ ర్తినా
దాస్ని దోసెయ్యాలనిపిత్తాది

సీక టడక ముందు
వొల్లమాలి నన్ని రంగులు
పడమ టేపు
వొయ్యారా లొలక బో త్తే
య్యేటి సెయ్యి బుద్దెయ్యదు
అటే సూత్తూ కల్లూ వొల్లూ
సంటోణ్ణి కూడ
సూడ మర్సిపోతాయ్ !

పొద్దుటేల గట్టిన బట్ట
పొద్దు గూకే తలికి
మట్టి గొట్టుక పోయి
సెమట కంపుతో
కడుపు ఱిప్పేసినాది

వొంటి మీ దింత గుడ్డ ముక్కుంటే సాలు
పేనానికి సాలొత్తాది
ఎట్టా ఇట్ట పడ్తున్నాడో యేమో
కానిట్టేబులయ్య

రంధి
సోమరాజు

గొడ్డు సెర్మంనాటి కాకి గుడ్డలు
అంతేనే తిండికోసరం
సీదర మొయ్యికేటి సేత్తాడు !

సెమటతో తడ్సి నొల్లు
వోనలో తగలడే
పెట్రోలు బంకునా
మండుద్ది
వోడు సయించగల్డు
ఆ తాటాకుల మంట !

ఇసినికర్ర మీద నీలు జల్లి
బాబు కిసిరే బుడ్డోడు
ఆటల కెగి రెల్లా లంటే
కుదుర్తా దేటి ?
అటూ ఇటూ కదుల్తూ ఆలయ్య
'ఏరా.... ఇనవేరా.... అంటూనే వున్నాడు

పిల్లలకి ఎండా నేదు కొండా నేదు
గోడాట్లో ములిగి ములిగి
ఆ తల్లి సల్లంగ ముద్దెట్టు కోని
సక్కిలిగింత లెడ్తే
కతలు సెప్తారో యేమో....
యిల్లే మర్సిపోతారు

రంధి
సోమరాజు

వొల్లు బిర్సెక్కి పోనాక
సొక్కాలతో తలతుడ్సేసు కోని
యెండలో పడి
నిక్కబొడ్సుకున్న ఎంట్రుకలతో
ఎర్రనీ కల్లతో
ఇంటి కొత్తరు ఎర్రి నాగమ్మలు
ఎండ దేవుళ్ళు !

అమ్మ మాటిన్రు అయ్య మాటిన్రు.
సూరిదేవుడి సిట్టి బుల్లోళ్ళు
కొడతాకి సేతులేటొత్తాయి
ఎల్తురు బొమ్మల్ని ?

తిండి తిన్రు
'వో' నీలు తాగేత్తారు
కూజా నీలంటే
మా సెడ్డ మోజు !

కుర్ర నాగమ్మల వొల్లు
నూకల కూడునా పేలిపోద్ది
మంచి గందం సెక్క
అరగ దీసి పామితే
తల్లి సుట్టూ గందం బొమ్మల్లా
గెంతు లేత్తారు

దండి
సోమరాజు

పనస పిక్కల్లాగ
సెగ్గడ్డ లేత్తే
కూరొండేత్తం అని
పెద్దోలు; పిల్లల్ని
ఆట పట్టిత్తున్నారు

పొద్దు గూగ్గానే
యిన్ని వుడుకు గెంజినీలు
వుప్పేసుకోని తాగితే
వొడదెబ్బ
దా నబ్బని కల్సు కుంటాది

సల్లని నీడల్లో
కొబ్బరాకులు సాటెట్టి
దాసిన టెంకాయలు
సెక్కుకోని తాగితే
పేనాలు లే సొత్తాయ్....
నోట్లో ఏసుగుంటే సాలు
మీగడ్లాటి నేత కొబ్బరి
అమ్మ మనసునా కరుగుద్ది

తాటి ముంజి లెన్ని తిన్నా
ముద్దు లేనా వొద్దంటాదికాని
ఆటి నొ ద్దనదు పేనం !

రంధి
సోమరాజు

వుప్పూ కారం ఏసి
జీడి మామిడి పల్లు
తింటా వుంటె
మూడో రేతి
ఆలి కోసం
తొక్కిస లాడే వొల్లునా
నో రూరుద్ది !

సవ్వగా వున్నా
పుచ్చకాయలు
నాలిక పెడార్సుక సావకుండా
సూరీడుకే దావత కట్టిత్తాయ్
సెక్కేసి వుప్పునీలతో కడిగేసి
అనాస కాయ ముక్కలు కోసుకోని
పంచదారలో ఏసి నాలిక మీ దెడితే... వాఁ
ఎల్లవే ఏసంగీ
మా దగ్గర కాదు నీ యేసాలు
అనాలని పిత్తాది

పంచదార కల్తీ వోటి తింటే
సాల్దేటి జెల్మకి ? ఆదేటి కర్మో
యీ జెల్మలు మిగల్సాలనో యేటో
ఆ వొక్కటీ పికరు నేకుండా వుంది !

రంధి
సోమరాజు

మామిడి పల్లు మా రాజులకే
ఆటి కరీదు
సూరీడునా మండుద్ది !

మామిడి కాయ ముక్కగొడ్తూ
ఏలు తెగ్గోసుకోని
ఆవకాయ రుసులు
గేపకాని కొత్తే
ఏలు సంగతే మర్సి పోనాడు
ఆవకాయ బుల్లోడు

నపోటా పిక్కల్లాటి కల్లు
తిప్పి తిప్పి సూత్తే
సిన్నది
నపోటానా గుంది !

మామిడి కాయిలోని జీ డెట్టి
గోడ ల్నిండ కుర్రోలు
పిచ్చి గీతలు గీత్తె
ఎండలికి కల్లు పచ్చగిల్లి నట్టుంది గోడ !

ఎండని సూసి కంసాలోడు
కరుగుతూన్న బంగారం నా గుందెహె అన్నాడు
నగలు సేసి ఆడి సెల్లి కెడతా డేమొ !

తండ్రి
సోమరాజు

ఆదేట్టో
దుడ్డు లే నోడి యింటి ముందు
అయిరాన సేసే
రాకాసి పస్నుల కలకటేరునా
యెగదోసు కొత్తాది యెండ !

వట్టేళ్ళ తడకలు కట్టుకోని
నీలు జల్లించు కుంటూ బలిసి నోల్లు
పంకా లేసుకోని
మద్దేన పేల
సైతుగా కునుకు తా రిల్లల్లో
డబ్బున్నోలకి కాలం బలాదూరె హై !

నీ లెండ బెట్టవేం అని
వోడో సూరీడి నెత్తిమీద కూసోని
గొడ్డును బాదినట్టు బాదుతా వుంటే
యెండ సిన్నోడు
వొగుర్తూయిడ్సిన గాలే నంట
యీ వొడ గాడ్పు !

రైలింజిన్లో పోరుమేను (Foreman)
వో సిన్ని నిప్పుగ డ్డయ్యుంటాడు

రంధి
సోమరాజు

నేక పోతే ఆ డానిప్పుల మద్దె
యీ గాడ్పుల మద్దె
బత గ్గ ల్లేటి ?

యెండలో బడి
తోటకూర కాడల్లాటి కుర్రోలు
సినేమా బొమ్మల్ని
మొయ్యినేక మొయ్యినేక
సచ్చి యీదీది తిప్పుతా వుంటె
అందరికల్లూ ఆబొమ్మ లేపే
కుర్రో లేపు సూసే కన్నే నేదు
ఆందుకే సూరీడు
ఆండర్నీ యిట్టా యేపేత్తున్నాడు !

ఏడికి సైకిలు పేశీలు
కరిగి పోయి
సెక్రాలు తుస్సున
బొక్కి నోరునా సప్పడి పోనాయ్

లారీ డ్రైవోర్లు
యెండకి తాలనేక
అడు గడుక్కీ
కూ ల్డింకులు పట్టేసి
బతికి పోనారు

రంధి
సోమరాజు

సిన్ని తువాలు తడిపేసి డ్రైవోరు
సెవులికి సుట్టు కుంటె
శెనంలో ఆది పూతరేకునా
మొరమొర లాడి పోనాది

బెడ్డ బెడ్డకి సెంబుడేసి నీలు తాగి
తాపీ వోడు యిల్లు కడతా వుంటే
గోడలికి నీలు సాల్డం నేదని
అలో పొలో మన్నా డాసామి !
పేనాలు కన్ను యిల్లే సిరకాలం మన్నుద్దిగా మరి !

బోయిలేరులో నడ్సెల్తున్నట్టుంది
రామసెంద్ర పెబో
యెండలో నడక !

కన్నంలో వుడికి వుడికి తేలు
గా తేత్తాదని గోడెక్కితే
సూసు కోకుండ బుల్లోడు సెయ్యేసి నాడు
యింకే టుంది
సటుక్కున కసిదీర కుట్టేసి నాది
ఎర్రని ఎం డనుకోని ఆ సెయ్యి !

రేత్రైతే పెల్లాలు పో రెడతారని
మేట్నికి సెక్కేసి ఆల్లో వుక్కతో

రంధి
సోమరాజు

ముక్క సెక్కలై పోతారు
వొల్లంతా యేర్లై సెమట
సొక్కాను సెర్మానికి మే తెట్టి
జిగటనా అంటేసుక పోద్ది
సెర్మంలోంచి సెగలు
యెసర్నా ఎగదన్ను కొత్తాయి
యింకేటి సల్లార్తాది మంట
కావేసినట్టు మగ్గిపోతారు
ఎండల్లో మద్దేనపేల
బొమ్మలాట సుకం అంటే యిదే
సుకం నేక పోగా
ఇల్లకాడ పెల్లాలు
కుక్కల్లా సుట్టకం పోసన
పసిగట్టేసి
సూ రెగర గొట్టేత్తారు

వో కుర్రోడు
సరదాకి సాసింటి కెల్తే
ఏటో సుకంగా నేదు
పొమ్మందంట
వొల్లమ్ముకునే వోలికి
కట్టంగానే వుందికాలం !

రంధి
సోమరాజు

యిల్లల్లో పెల్లాలు
పాములొ్ని సూసి నట్టు
దూరంగా సత్తారు
పున్నెముండి వోనొత్తే సాలు
పేనాలు పేనాలు
కలేసు కోని
ఎయ్యేళ్ళ సుకం
యెన్నె లౌద్ది !
యేటొ అంత వుడికి సత్తేగాని
యింత సుకం కల్సి రాదేమొ !

గాలి నేక శెదుల్లో
వొళ్ళొక్కాసి వొంటిమీద గుడ్డొక్కాసి
వొయ్యారా లోతే
తెల్లార్లూ యీది దీపాలు
ఆ దిసమొల రొమ్ములేపు
రెప్పార్పకుండ సూసి సూసి
మొగుడు సూరీ డొత్తున్నా డని
సటుక్కున దొంగకుర్రోల్లా
కల్లుమూసేసి నాయి!

మారంగుల సోకు సూడు సూడని
వో వూరేగిన కోట న్నాకులు

తంధి
సోమరాజు

పొద్దోయే తలికి పల్లు బయిటెట్టి మాడి సచ్చాయి
సూత్తూన్న పచ్చని జామాకు
జామి నవ్వే నవ్వింది
సోకు సూసు కోని కోటన్నాకు లికిలిత్తే
బలం వుందని జామి యిరగ బడించి
బలం లేనోల్ని సంపిన యెండ
బలం వున్నోల్ని యేటీ సెయ్యినేక
ముసిలికుల్లు మురుగు రగతం నవ్వు
నవ్వనేక నవ్వనేక సచ్చింది !

రేతి రంతా నిద్దరో నీకుండ
రంకు మొగుడ్నాగ
యీది కుల్లు కాల్వ
మద్దె మద్దెన పిల్ల గాలికి లెగ్సి
పేనాలు తోడేసింది
పిల్ల గాలి సుకం
కుల్లు కాల్వలకే అయ్యుంటాది !

హోరున సినిమా జనం
ఆల సరవాల్లో ఆలు
యికి లింతలు సికిలింతలతో
ఈదులంట ఎల్లి పోతూ
ఆల నిద్ర ఈల నిద్ర

రంధి
సోమరాజు

బందిపోటు దొంగల్లా
దోసుకు పోనారు
ఆలకి లేని కునుకు సుకం
బైటోల కండ గూడ దన్నట్టు !

మద్దె మద్దెన లారీలు కార్లు
రాచ్పసి కళ్లతో
సూరీడు నాగ
కునికీ కునకని కల్లని పొడ్సి
రెప్పల కెలుతు రగ్గెట్టేసి
నడి ఏసవి పగలు కాదు
రేత్రే అన్నై !

కోడినాగ యింత కునుకు
కునికే తలికి
ఇగసాలు 'లే' అన్నట్టు
యిట్టే సుకం తెల్లారి పోనాది !

బతుకులో సుకం సిటికెడే నేమొ
తెల్లారగట్ట శీతగాలి కొట్టి
పేనానికి పేనమయింది

ఆ సుకం సూడనేక
కడుపుబ్బి

రంధి
సోమరాజు

పుచ్చకాయి గింజల్లా
పుట్టె డీగలు
మీదనోలి
సీకాకు పెట్టేసినై !

ఇక నాబం నేదని అయ్యిగోరు
యింట్లో కెల్తే
రేతి రంత కైదు సేసీసి నారని
కుత కుత వుడికి పోయి
మొగం మీద అరిసేత్తో కొట్టినట్టు
ముక్కుమీద ముక్కింది ముక్కగాలి !

ఆ కంపు నెటాగో సయించి
బాబుగారు పంకా ఎట్టు కుంటే
శెనంలో పిల్లి రక్కేసినట్టు
ఏడిగాలులు రక్కేసి వొదిల్నై !

ఈ సావు సావనేక అయ్యిగోరు
సన్నీల తానం సేసే తలికి
పేనాలు లేసొచ్చినై గామోసు
'హమ్మయ్య' అన్నారు
అలాటి పలుకెప్పుడో గాని వూడి పడదంట
అదేనంట సొరగం !

రంధి
సోమరాజు

గాలికి గోడలంటే
మా సెడ్డ కోపం
మడ్సులికి గోశ లంటే
మా సెడ వుటం
వుడక మోతకి గుడ్డ ముక్కలంటే ఆశేయం
గుడ్డ నేకపోతే నోకాని కశేయం
అందుకే నొరే
సుకాలకీ ఆశేరాలకి సుక్కెదురు !

సల్లని సూపుల్తో ఏకాసులు పేసి
ఆనక రాకాసుల్లా కయ్యాలాడే
ఆడంగులికీ ఏసంగికీ
యేటీ తేడా నేదు
వోరున వోన కుర్సినప్పు డెల్లా సల్లంగ వుంటదో
యెండెక్కితే సాలు
అంతమండుక పోద్ది !

వొలంగా బల్సినోలు
తొడలు కొట్టుక పోయి
సవాయి తగులు కన్నోల్లా
నడుతారు
ఆల్ని సూత్తే
వుత్తినే నవ్వొత్తాది !

తంధి
సోమరాజు

మేదర పేట తగలడి
తుర తుర బుగ్గైపోతే ....
బుగ్గి మీదయిన్ని నీలు జల్లి
మీసా లెగ దువ్వేయి !
ఈ దులంట సెవులు సిల్లు లడేలా
గంట లోయిచ్చు కుంటూ
ఆవు రావురని యిరగబడ్డ నీలకార్లు !

కొలిమి కాడ తిత్తూదే కుర్రోడు
సొమ్మసిలి పోనాడు
"అమ్మ" అనికూడ అననేదు

సెప్పుల్లే కుండా రోడ్డేసేవోల్ని సూసి
తారుతో కరిగి
డబ్బాలోంచి సుక్కలు సుక్కలుగా రాలి
ఏడ్సింది ఎండ !

సెక్కాలు తిప్పే సెల్లెమ్మ
సెక్రం తోనె తిరిగి పోతూన్నట్టు
కల్లు తిరిగి పడిపోనాది

ఆయిసుపూటు లమ్ముతూ సిట్టి తండ్రి
అమ్మ కడుపులో సిచ్చెట్టి
వొడ దెబ్బకు రాలి పోనాడు !

రంధి
సోమరాజు

యిసక తిప్పలతో
బయటడ్డ గోదారి
యెట్టాం టోలకేనా
తిప్పలు
తప్పవన్నట్టుంది !

పిటపిటలాడే సాకలిసిన్నది
వొయ్యారం వొల్లైంది
రేవు కాడ రై కిసి రేసి
వున్న వోయిల సీ రిప్పకుండ
నీల్లల్లా ములిగి
మునేల మీద గట్టెక్కితే
ఓరి నాయినో ఎయ్యికల్లు సాలవ్
పొరలు పొరలుగా
తడి వొదుగుళ్ళ సీర నలుగుళ్ళు
సెర్మాన్ని సుట్టేసుకోని
బిగువుల్ని సూపితే
సిగ్గేసి సిన్నది సిన్న నవ్వు నవ్వితే
ఛస్ .... ఆ నవ్వునా ఎలగనేక పోనా నని
సూరీడు సిగ్గుతో సత్తా డంతే !

అలిండియా రేడియో
ప్రసారితం

55

రంధి సోమరాజు

రచనలు

నవలలు :	ఆదర్శాలు - అవరోధాలు .
	సౌందర్యం . సౌశీల్యం
	దుఃఖితులు
కథలు :	ఉన్నతాశయాలు
	దేవుడైన మానవుడు
	నేనేమి చేశాను
	ఈమనిషి - ఈలోకం
	సోమరాజు కథలు
గేయ నాటికలు :	రతనాల తండ్రి
నవ కవిత :	విరిగిన కల్చర్
	ఎదగండి
	బూర్జువా పెళ్ళికూతురు
	పాదు
	సిన్నమ్మ పొచ్చింది !

ప్రతులకు : శశిధర్ పబ్లికేషన్స్ 44-13-43 అన్నపూర్ణపేట రాజమండ్రి-3 &
సరస్వతీ పవర్ ప్రెస్ రాజమండ్రి.

BCT

RMRA 108 B 173

BC

P O D D U

NAVA KAVITA

RANDHI SOMARAJU

Price Rs. 3/-

For Copies :

SASIDHAR PUBLICATIONS

44 - 13 - 43

ANNAPURNAPETA ,

RAJAHMUNDRY - 3

మవసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	RMRA108B173
పుస్తకం పేరు	పొద్దు
తారీఖు	22 January 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	81
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	1,4,22,36,55,BCI
లేవి పేజీలు	no
తయారు చేసినవి	Mary
పేజీలు విడదీసినవి	Mary
స్కాన్ చేసినవి	Bhanu
పరీక్ష చేసినవి	HEMA
పేజీలు సరిచూసినవి	
బైండింగు చేసినవి	
ప్యాకింగు చేసినవి	
పరిస్థితి	Good